క్లుప్తంగా

జాతరకైనా జీతాలు ఇవ్వండి దేవరా!


ఆందోళన చేస్తున్న పారిశుధ్య కార్మికులు

పలమనేరు: మూడు నెలలుగా జీతాలు రాక కుటుంబాలు గడవడమే కష్టంగా మారిందని పట్టణంలో జాతర మొదలైనందున పండుగకైనా జీతాలు ఇవ్వాలని పట్టణంలోని ఏరియా ఆస్పత్రిలో పనిచేసే పారిశుధ్య కార్మికులు ఆందోళన చేశారు. ఈసందర్భంగా స్థానిక ఆస్పత్రి వద్ద శనివారం వారు ఆందోళన చేశారు. అనంతరం వినతి పత్రాన్ని ఆస్పత్రి సూపరింటెండెంట్ మమతారాణికి ఓ వినతిపత్రాన్ని అందజేశారు. దీనిపై ఉన్నతాధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని ఆమె తెలిపారు. ఇందులో కార్మిక సంఘ నేతలు రామక్రిష్ణ, నారాయణ, శ్యామల, విజయమ్మ, నాగమ్మ పాల్గొన్నారు.

చలో విజయవాడకు తరలిరండి


కరపత్రాలు విడుదల చేస్తున్న బహుజన సేన నాయకులు

శాంతిపురం: రాష్ట్రంలో ప్రత్యేక ఎస్సీ, ఎస్టీ సెల్ పోలీస్‌స్టేషన్లకు డీఎస్పీలను నియమించాలన్న డిమాండుతో బహుజన సేన తలపెట్టిన చలో విజయవాడ మహాధర్నాకు తరలిరావాలని సేన నేతలు కోరారు. శనివారం వారు శాంతిపురంలో బహుజనసేన జిల్లా అధ్యక్షుడు సతీష్, రాష్ట్ర కార్యదర్శి గోవిందప్ప మహాధర్నా కరపత్రాలను విడుదల చేశారు. ఈనెల 5న విజయవాడ ధర్నా చౌక్‌లో ఉదయం 11 గంటలకు తమ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీచందు ఆధ్వర్యంలో మహాధర్నా ఉంటుందన్నారు. ఏపీలోని 98 ఎస్సీ, ఎస్టీ సెల్ డీఎస్పీ పోస్టులను ప్రభుత్వం గుట్టుగా రద్దు చేయడాన్ని వారు ఖండించారు. ఆయా పోలీస్‌స్టేషన్లకు వెంటనే డీఎస్పీలను నియమించాలని కోరారు. నేతలు కుమార్, మురళి, గణేష్, తిమ్మరాయప్ప, భాస్కర్, చౌడప్ప, రవి పాల్గొన్నారు.

పోస్ట్‌కార్డుల ఉద్యమానికి శ్రీకారం


పోస్టుకార్డుల ఉద్యమాన్ని ప్రారంభిస్తున్న దేవానంద్

పుంగనూరు: డీఎస్సీ–2003 ఉపాధ్యాయులచే పోస్టుకార్డుల ఉద్యమాన్ని జిల్లా 57వ సాధన కమిటీ కన్వీనర్ రేగంటి దేవానంద్ నిర్వహించారు. శనివారం ఆయన మండల విద్యాశాఖ ఆవరణలో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన 57వ మెమోను ఆంధ్ర రాష్ట్రంలో అమలు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాత పింఛన్ విధానాన్ని వర్తింపచేయాలని కోరారు. సంఘ నేతలు రెడ్డిరాజేశ్వరి, సందీప్, శ్రీధర్, మణి, విజయ్‌కుమార్, మోహన్, కిరణ్, రమణ, నాగరాజు, గోవిందు పాల్గొన్నారు.

సాగులో పరిజ్ఞానం పెంచుకోవాలి


వ్యవసాయ పంటల సాగుపై స్మార్ట్ ఫోన్ల ద్వారా రైతులకు శిక్షణ ఇస్తున్న వ్యవసాయాధికారులు

రొంపిచెర్ల: వ్యవసాయ పంటలు సాగు చేసే రైతులు సాంకేతికంగా పరిజ్ఞానాన్ని పెంచుకోవాలని మండల వ్యవసాయాధికారి సుధారాణి అన్నారు. శనివారం ఆమె స్కిల్ ఆఫ్ చిత్తూరు–డిజిటల్ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆమె రైతులు స్మార్ట్‌ఫోన్లు ఎలా వినియోగించాలి, వ్యవసాయ సమాచారం తెలుసుకునే విషయమై రైతులకు అవగాహన కల్పించారు. ఫోన్ ద్వారా సమాచారం తెలుసుకునే యాప్‌లపై రైతులకు అవగాహన కల్పిస్తే ఎంపికైన రైతులకు మొదటి బహుమతిగా రూ.20 వేలు, రెండవ బహుమతిగా రూ.12 వేలు, మూడవ బహుమతిగా రూ.8వేలు ఇస్తామని తెలిపారు. అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రైతు సహాయ కేంద్రం ఇన్‌చార్జ్‌లు వెంకటరమణ నాయక్, సుజాత పాల్గొన్నారు.

పట్టాభూమి కొనుక్కో.. ప్రభుత్వ భూమి కలిపేసుకో!

- వెంచర్లు వేసి అమ్ముకుంటున్న రియల్టర్లు
- కూటమి నేతల రియల్ మోసాల వ్యాపారాలు
- వీరికి అండగా రెవెన్యూ సిబ్బంది
- పట్టణంలో 95శాతం అనుమతులు లేని లేఔట్లే

పలమనేరు: కొంత సెటిల్‌మెంట్ భూమిని కొనుగోలు చేసి దాని పక్కనున్న ప్రభుత్వ భూమిని కలుపుకుంటారు. రెండూ కలిపి వెంచర్ వేసి ప్లాట్లు చేసి సెటిల్‌మెంట్ పట్టా నంబరును చూపి స్థలాలను రిజిస్టర్ చేయడం పలమనేరు ప్రాంతంలో కొందరు రియల్టర్లకు పరిపాటిగా మారింది. స్థలాలు కొనేవాళ్లు డాక్యుమెంట్ చూసి అది పట్టానా కాదా రిజిస్టర్ అవుతుందా లేదా అని చూస్తున్నారేగాని తాము కొంటున్న స్థలం సంబంధిత పట్టా నంబరులోనే ఉందా అని పట్టించుకోవడం లేదు. ఈ విషయం సర్వే చేస్తే కాని బయటపడదు. దీన్ని అదునుగా చేసుకుని కొందరు రియల్టర్లు తాము కూటమి మనషులమంటూ రెవెన్యూ అధికారులను సైతం ఏమార్చి విచ్చలవిడిగా రియల్ మోసాలకు పాల్పడుతున్నారు.

మోసాలు ఎలాగంటే...

మండలంలోని బేరుపల్లికి చెందిన ఓ రైతు నుంచి కొందరు పచ్చనేతలు టి.వడ్డూరు వద్ద కొంత పట్టా భూమిని కొంతమేర కొనుగోలు చేశారు. ఈ భూమికి ఆనుకొని మండిపేటకోటూరు గ్రామానికి వెళ్లే రహదారి పక్కన రోడ్డుకు ఆనుకొని కొంత రాస్తా పోరంబోకు ఉంది. ఇదే భూమికి దక్షిణం వైపు గట్టు పోరంబోకు స్థలాలున్నాయి. ఇది తెలుసుకున్న వారు కొన్న భూమితోపాటు ప్రభుత్వ స్థలాలను ఆక్రమించుకొని ఏంచెక్కా వెంచర్ వేసి స్థలాలను సిద్ధం చేశారు. దీన్ని గమనించిన గ్రామస్తులు ఇటీవల పలమనేరులో గ్రీవెన్స్‌డేకు వచ్చిన కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఆయన ఆదేశాలతో రెండు రోజుల క్రితం సర్వే చేసిన అధికారులు ఆ వెంచర్‌లో ప్రభుత్వ భూమిని ఆక్రమించుకున్నారని గుర్తించి అందులో నాటిన రాళ్లను తొలగించారు. ప్రభుత్వ స్థలాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఇదేవిధంగా నియోజకవర్గంలో పచ్చనేతలకు సంబంధించిన పలు వెంచర్లు ఉన్నట్టు తెలిసింది.


టి.వడ్డూరు వద్ద ప్రభుత్వ భూమిని ఆక్రమించుకొని వేసిన వెంచర్


బొమ్మిదొడ్డి చెరువు కింద కీలేరిలో వెలసిన వెంచర్

రెవెన్యూ సిబ్బంది అండతో అక్రమాలు..

తాము అధికార పార్టీకి చెందిన వారమంటూ రియల్టర్లు సంబంధిత వీఆర్వో, సర్వేయర్ సిబ్బందిని తమ గుప్పిట్లో పెట్టుకుంటున్నారు. దీంతో వీరి అండతోనే రియల్ వ్యాపారం సాగుతోందనే విమర్శలున్నాయి. వీరేం చేసినా వీరికి రెవెన్యూ సిబ్బంది అండ ఉండడంతో ఎవరూ ఎలాంటి అక్రమాలను తెలుసుకోలేకపోతున్నారు.

రిజిస్ట్రేషన్ అవుతుందా కాదా..

ఎక్కడైనా వెంచర్‌లో తాము కొనే స్థలం రిజిస్టర్ అవుతుందా లేదా అని మాత్రమే కొనుగోలుదారులు చూస్తున్నారు. కానీ తాము కొంటున్న స్థలం సర్వే చేస్తేగాని అది కొంటున్న పట్టాలో ఉందా లేదా ప్రభుత్వ డీకేటీగా ఉందా అనే విషయం బయటపడదు. రియల్ ఎస్టేట్ దళారుల మాట నమ్మిన జనం ఎడాపెడా ఇలాంటి స్థలాలు కొనేస్తున్నారు. తీరా అసలు విషయం బయటపడితేగాని వీరు మోసపోయారన్న విషయం వారికి తెలియని పరిస్థితి.

95శాతం వెంచర్లకు అనుమతులే లేవు

పట్టణంతోపాటు నియోజకవర్గంలోని వెంచర్లు 50 దాకా ఉండగా వీటిలో ఐదింటికి తప్ప 45 వెంచర్లకు అసలు పంచాయతీలోగానీ, పట్టణంలో అయితే మున్సిపాలిటీలో అసలు అనుమతులు లేవు. వీటిని కొనుక్కున్నవారు ఇల్లు కట్టుకోవాలంటే అప్పుడు అన్ని అనుమతులు కోసం లక్షల్లో వెచ్చించాల్సి ఉంటుంది. అంతెందుకు అగ్రికల్చర్ భూముల్లో వెంచర్లు వేయాలంటే ఆభూమిని నాన్ అగ్రికల్చర్‌గా మార్పు చేసుకోవాలి. కానీ ఎవరూ చేసుకోవడంలేదు. పట్టణ సమీపంలోని బొమ్మిదొడ్డి కీలేరిలో పచ్చని వరిపంట పండే కీలేరిలో సైతం ఇటీవల ఓ వెంచర్ వెలిసింది. అయితే అధికారులు దీనిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు.

అధికారం ఉందని మోసాలకు దిగితే ఎలా..



అధికారంలో ఉన్నాం కదా అని ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా పోవడం తప్పు. కొందరైతే పట్టాభూమి నంబరు చూపి పక్కనున్న డీకేటీలను సైతం స్థలాలుగా అమ్మేశారు. అధికారులు సైతం సర్వే చేసి ఆపై స్థలాలను వేసేలా చూడాలి. రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యంతో ఇలాంటి మోసాలు సాగుతున్నట్టు సమాచారముంది.

వెంకటేగౌడ, మాజీ ఎమ్మెల్యే

వెంచర్‌లో స్థలం కొనాలంటే ఆలోచించాలి..



ఈమధ్య ఎక్కడ చూసినా పొలాల్లో సైతం వెంచర్లు వెలుస్తున్నాయి. వీటికి అనుమతులున్నాయా లేదా అని ఎవరూ పట్టించుకోవడం లేదు. బ్రోకర్ల కమీషన్ల కోసం చెప్పే మాయమాటలను జనం నమ్ముతున్నారేగానీ దానిపై వారికి ఎలాంటి అవగాహన లేదు. దీంతో చివరకు బాధపడేది కొనుగోలు చేసిన వారే.

రంగన్న, సముద్రపల్లి

నోటీస్ బోర్డు

- గ్రీవెన్స్‌డే రేపు

పలమనేరు: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట దాకా ప్రత్యేక ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్‌గాంధీ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. పలమనేరు రెవెన్యూ డివిజన్‌లోని ప్రజలు సమస్యలపై అర్జీలు స్వీకరించి వాటి పరిష్కారం కోసం కృషిచేస్తామని అందులో పేర్కొన్నారు.

లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గం ఎన్నిక


వెంకటసిద్ధులు

పులిచెర్ల(కల్లూరు): కల్లూరు లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గాన్ని శనివారం జిల్లా క్రీడా విభాగం అధ్యక్షుడు లయన్ మహ్మదాలీ అధ్యక్షతన ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా వెంకటసిద్దులు, కార్యదర్శిగా ఇషాన్, సలహాదారుడుగా పోకల తాతయ్య, కోశాధికారిగా రాజేంద్ర, సభ్యులుగా ఆర్‌ఎస్.రాజన్, రాజారెడ్డి, చాన్‌బాషా, లావణ్య నియమితులయ్యారు.

ఎంపీడీఓలకు సన్మానం

చిత్తూరు కార్పొరేషన్: ఇటీవల జిల్లాలో నలుగురు డిప్యూటీ ఎంపీడీఓలకు ఎంపీడీఓలుగా ఉద్యోగోన్నతి లభించిన విషయం తెలిసిందే. అందులో ముగ్గురిని డీపీఓ కార్యాలయంలో డీపీఓ సుధాకర్ రావు సన్మానించారు. గంగాధర నెల్లూరు, వెదురుకుప్పం, రామకుప్పం ఎంపీడీఓ కార్యాలయల్లో డిప్యూటీ ఎంపీడీఓలుగా పనిచేస్తున్న హరిప్రసాద్ రెడ్డి, పురుషోత్తం, రాజశేఖర్‌బాబుకు ఎంపీడీఓలుగా ఉద్యోగోన్నతి రావడంపై ఆనందం వ్యక్తం చేశారు.

వైభవం..ధ్వజారోహణం

- ప్రత్యేక పూజలందుకున్న ఆధిశేషుడు


ధ్వజారోహణం నిర్వహిస్తున్న అర్చకులు

చౌడేపల్లె: స్థానిక శ్రీఅభీష్టద మృత్యుంజయేశ్వరస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదిశేషుడుగా పేరొందిన శివ పార్వతులకు శనివారం ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారి ఉత్సవమూర్తులకు రాజశేఖర దీక్షితులు, కుమారస్వామి, మహేష్‌ల ఆధ్వర్యంలో అర్చనలు, అభిషేకాలు చేశారు. ఆలయంలో వేదపండితుల మంత్రోచ్ఛారణలతో ధ్వజారోహణం వైభవంగా జరిగింది. కార్యక్రమానికి ఉభయదారులుగా పద్మశాలి కులస్తులు వ్యవహరించారు. అనంతరం ఉత్సవమూర్తులను పురవీధుల్లో ఊరేగించారు. మందహాసం విరాళమిచ్చిన దాత చౌడేపల్లె మాజీ సర్పంచ్ పద్మావతమ్మ, రాధాకృష్ణ, శిరీష కుటుంబసభ్యులు పూజల్లో పాల్గొన్నారు.

పరిశ్రమల ఏర్పాటుకు కృషి


ఏపీఐఐసీ జెడ్ఎంతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

పలమనేరు: పలమనేరు ప్రాంతం పరిశ్రమల ఏర్పాటుకు అనుకూలంగా ఉన్నందున ఇక్కడ పరిశ్రమల ఏర్పాటుకు కృషిచేయాలని స్థానిక ఎమ్మెల్యే అమరనాథరెడ్డి ఏపీఐఐసీ జెడ్ఎం సుబ్బారావుకు ఇక్కడి ఆయన కార్యాలయంలో సూచించారు. ఇక్కడున్న ఔత్సాహిక పారిశ్రామికవేత్తలతో పరిశ్రమల స్థాపనపై అవగాహన కార్యక్రమాలను ఏర్పాటు చేయాలన్నారు. పలమనేరు, గంగ్రాజుపల్లి ఎంఎస్‌ఎంఈలో సమస్యలు లేకుండా చూడాలన్నారు. ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు, గార్మెంట్స్‌లాంటివి ఏర్పాటు చేసేందుకు బైరెడ్డిపల్లి, వి.కోటలు అనుకూలమని తెలిపారు.

పటిష్టంగా పారిశుధ్య చర్యలు


ట్రాక్టర్లను పరిశీలిస్తున్న కమిషనర్, చైర్మన్

పుంగనూరు: మున్సిపాలిటీ పరిధిలో పారిశుధ్య కార్యక్రమాలను పటిష్టంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు కమిషనర్ మధుసూదన్ రెడ్డి తెలిపారు. శనివారం చైర్మన్ అలీమ్‌బాషాతో కలిసి నూతనంగా కొనుగోలు చేసిన ట్రాక్టర్లను పరిశీలించారు. కమిషనర్ మాట్లాడుతూ తడి చెత్త, పొడి చెత్తను వేరుచేస్తూ ఎప్పటికప్పుడు కార్మికులతో ఇళ్ల వద్దనే చెత్తను సేకరిస్తున్నామన్నారు. 31 వార్డుల్లో పారిశుధ్య కార్యక్రమాల కోసం తగిన సిబ్బందిని నియమించి, ప్రజారోగ్యాన్ని కాపాడేందుకు చర్యలు తీసుకున్నామని తెలిపారు. వేసవిలో నీటి సమస్య లేకుండా చూస్తున్నామని చెప్పారు. పట్టణ ప్రజలు సకాలంలో పన్నులు చెల్లించి, మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరించాలని ఆయన కోరారు. డీఈఈ మహేష్ పాల్గొన్నారు.

అలరించిన సంపూర్ణ రామాయణం నాటకం


సంపూర్ణరామాయణం నాటకాన్ని ప్రదర్శిస్తున్న కళాకారులు



పలమనేరు: పట్టణంలోని తిరుపతి గంగమ్మ జాతరలో భాగంగా మూడో రోజు శనివారం స్థానిక గంగమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. పట్టణానికి చెందిన యాదవ, భేరి సంఘాల ఆధ్వర్యంలో పూజలు, అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా కోడి కిశోర్ ఆధ్వర్యంలో సంపూర్ణ రామాయణం నాటకం భక్తులను అలరించింది. ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పోషకాల తాటిముంజ


కుప్పం రోడ్లపై వెలసిన తాటి ముంజల దుకాణం



- తాటి ముంజలకు భలే డిమాండ్
- తమిళనాడు నుంచి కుప్పానికి వ్యాపారులు
- రోడ్ల వెంబడి దుకాణాలు

కుప్పంరూరల్: వేసవి కాలమంటే కుప్పం అన్ని ప్రాంతాల కంటే చల్లగా ఉండి ప్రత్యేకతను చాటుకుంటుంది. అందుకే ఇతర ప్రాంతాల నుంచి ఎవరు కుప్పం వచ్చినా ఇక్కడే స్థిర నివాసం ఏర్పాటు చేసుకుని ఉండిపోతున్నారు. ఈ ప్రత్యేకతతోపాటు వేసవిలో మరో విశేషం కుప్పంలో చోటుచేసుకుంటుంది. అదే తాటిముంజలు అందుబాటులోకి రావడం. వేసవి రాగానే తమిళ వ్యాపారులు కుప్పం చేరుకుని ముంజల వ్యాపారం ప్రారంభిస్తారు. అద్భుత రుచి, శరీరానికి చలువ చేసే గుణాలు తాటిముంజల్లో ఉండడంతో ముంజలను కొనేందుకు కుప్పం జనం ఎగబడుతున్నారు.

వేసవి అంటే కుప్పానికి తమిళ వ్యాపారులు

మార్చి నెల రాగానే తమిళనాడు తాటి ముంజలు అమ్ముకునే చిరువ్యాపారులు కుటుంబాలతోపాటు కుప్పం వచ్చి వాలిపోతుంటారు. ఉదయం 7 గంటల నుంచి ప్రారంభించి రాత్రి 9 గంటల వరకు తాటిముంజలను కొడుతూ, అమ్మకాలు సాగిస్తుంటారు. ఉదయం తమిళనాడులోని వరటనపల్లి, క్రిష్ణగిరి, తిరుపత్తూరు ప్రాంతాల నుంచి లారీల్లో తాటి ముంజలను ఏ రోజుకారోజు దిగుమతి చేసుకుంటారు. ఉదయం 7 గంటలకే ప్రారంభిస్తుండడంతో జనం ఏకధాటిగా కొంటూనే ఉంటారు. డజను ముంజలు రూ.100 పలుకుతున్నా జనం మాత్రం ఏమాత్రం తగ్గడం లేదు. వ్యాపారులకు సైతం లాభసాటిగా ఉండడంతో ఏటా మార్చి నెల రాగానే తమిళ వ్యాపారులు కుప్పం వచ్చి రోడ్ల వెంబడి టెంట్లు వేసుకుని వ్యాపారం సాగిస్తుంటారు.

తాటిముంజల్లో పోషకాలు

తాటి ముంజలు రుచిగా ఉండడంతో పిల్లలు నాలుగైదు ముంజలు ఇట్టే లాగించేస్తుంటారు. కానీ వైద్యులు మాత్రం తాటి ముంజలను తొక్కతో తింటేనే మంచిదని సూచిస్తున్నారు. అంతేకాకుండా ముదిరిన ముంజలు తింటే కడుపునొప్పి వచ్చే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు. ఇక పోషకాల విషయానికి వస్తే తాటి ముంజలు శరీరంలో నీటి శాతాన్ని పెంచుతాయి. వడదెబ్బ బారిన పడకుండా కాపాడుతుంది. విటమిన్ ఏ, బీ, సీలతో పాటు శరీరానికి కావాల్సిన జింక్, పోటాషియం, పాస్ఫరస్, ఐరన్‌ను అందిస్తుంది. ట్యూమర్లు, కేన్సర్ రాకుండా కాపాడుతుంది. పోటాషియం అధికంగా ఉండడంతో రక్తపోటును తగ్గించి శరీరంలోని మలినాలను బయటకు పంపుతుంది. కడుపు ఉబ్బరం, వికారం, మలబద్ధకం సమస్యలను తగ్గిస్తుంది. రోగనిరోధక శక్తిని పెంచి లివర్ సమస్యలను తొలగించి, చర్మ సౌందర్యానికి దోహద పడుతుందని వైద్యులు చెబుతున్నారు. ఇన్ని పోషకాలు ఉన్న ముంజలను ఎవరైనా తినకుండా వదిలి పెడతారా కుప్పం జనం అంతే ఎగబడి కొనేస్తున్నారు.

ఇంటిల్లిపాది ఇష్టపడి తింటాం...

వేసవి రాగానే మా పిల్లలకు తాటిముంజలే గుర్తుకొస్తాయి. నేను మా కుటుంబసభ్యులు వేసవిలో వారంలో నాలుగు రోజులు తాటి ముంజలు తినాల్సిందే. తమిళనాడు వ్యాపారులు డజను రూ.100 అమ్ముతున్నారు. అయినా పర్వాలేదు. నిత్యం కొని తినాల్సిందే.

గణపతి, గుడ్లనాయనపల్లి

కమనీయం.. సీతారాముల కల్యాణం


కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

పులిచెర్ల(కల్లూరు): అయ్యావాండ్లపల్లెలో శనివారం రాత్రి సీతారాముల కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఉదయం గణపతి పూజ అనంతరం స్వామివార్లకు అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. శాస్త్రోక్తంగా అర్చకులు సీతారాముల కల్యాణం జరిపించారు. అనంతరం పుష్పపల్లకీ సేవ, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. టీటీడీ మాజీ పాలక మండలి సభ్యుడు పోకల అశోక్‌కుమార్ పాల్గొన్నారు.

అంబులెన్స్ నిర్వాహకుల దందా!

- భారీగా డబ్బులు వసూలు
- అంబులెన్స్‌లో కనిపించని అత్యవసర సౌకర్యాలు



పలమనేరు: స్థానిక ఏరియా ఆస్పత్రి వద్ద ప్రైవేటు అంబులెన్స్ నిర్వాహకుల దందా పెచ్చుమీరుతోంది. వీరంతా సిండికేట్‌గా మారి అత్యవసర రోగుల ప్రాణాలతో వ్యాపారాలు చేసుకున్నట్టు తెలుస్తోంది. తాజాగా నెల్లిపట్ల గ్రామానికి చెందిన ఓ వ్యక్తి గుండెపోటుకు గురై కుటుంబీకులు ఇక్కడి ఆస్పత్రికి తీసుకొచ్చారు. అతన్ని పరిశీలించిన వైద్యులు పరిస్థితి విషమంగా ఉందని తిరుపతి రుయాకు రెఫర్ చేశారు. అయితే ఇక్కడి ఆస్పత్రి అంబులైన్స్, 108 వాహనాలు తిరుపతి దాకా వెళ్లవు. ఎమర్జెన్సీ సేవలకు కేవలం జిల్లా ఆస్పత్రి దాకా ఈ వాహనాలకు అనుమతులున్నాయి. దీన్ని ఆసరాగా చేసుకొని పట్టణంలోని కొందరు ఆస్పతి వద్ద ప్రైవేట్ అంబులెన్స్‌లను ఏర్పాటు చేశారు. వీరంతా సిండికేట్‌గా ఏర్పడి పలమనేరు నుంచి తిరుపతికి 110 కిలోమీటర్లకు భారీ మొత్తంలో బాడుగగా నిర్ణయించారు. కానీ ఆక్సిజన్ సౌకర్యం లేని అంబులెన్స్‌లు భారీగా డబ్బులు వసూలు చేయడంపై అత్యవసర రోగుల కుటుంబీకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆస్పత్రి వద్ద ఉన్న ప్రైవేటు అంబులెన్స్‌లు తప్ప ఇతర వాహనాలు ఆస్పత్రి వద్దకు రాకుండా వీరంతా ప్లాన్ చేశారు. ఎవరికి అవసరమైనా అక్కడున్న ప్రైవేటు అంబులెన్స్‌లలో వారు చెప్పినంత ఇచ్చి వెళ్లాల్సిందే. అయితే ఆస్పత్రిలోని కొందరు డాక్టర్ల సహకారంతోనే ప్రైవేటు అంబులెన్స్ నిర్వాహకులు ఇష్టానుసారంగా బాడుగలు పెంచి ప్రాణాపాయంలో ఉన్న రోగులతో ఆడుకోవడంపై పట్టణంలో సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి.